సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం : 14 : అక్టోబర్ : 2025



చోరీ కేసులో అరెస్టు
లింగపాలెం మండలంలో చైన్ స్నాచింగ్, దొంగతనాలకు పాల్పడిన ఐదుగురు నిందితులను పట్టుకుని, సొమ్మును పోలీసులు రికవరీ చేశారు. 8లో ▸



జోరు వాన.. నరకయాతన
పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో సోమవారం వర్షం దంచికొట్టింది. రోడ్లు అధ్వానంగా ఉండడంతో గుంతలు తెలియక వాహనచోదకులు అవస్థలు పడ్డారు. 8లో ▸



శివశివా.. ఇదేం దారుణం?
ద్వారకా తిరుమల భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో హోమాన్ని తాపీగమేళాలో నిర్వహించడం పట్ల పలువురు భక్తులు మండిపడుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



భీమవరంలో మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న దృశ్యం

భీమవరం: మునిసిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా నవంబరు 3 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు చెప్పారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం సమ్మె నోటీసును మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డికి అందచేసిన సందర్భంగా మాట్లాడారు. మృతి చెందిన, రిటైర్డు, అవుట్ సోర్సింగ్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని, 12వ పీఆర్సీ ప్రకటించి 30 శాతం ఐఆర్ ఇవ్వాలని, పెరిగిన జనాభా కనుగుణంగా కార్మికుల నిష్పత్తిని పెంచాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 62 ఏళ్లకు పదవీవిరమణ వయస్సును పొడిగించాలని, సులభ్ నిర్వహణ మునిసిపల్ కార్మికులకు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులకు ఇల్లు, ఇళ్ళ స్థలాలు కేటాయించి మున్సిపల్ కాలనీలు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

తపాలా శాఖలో అందుబాటులోకి కొత్త సేవలు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా భీమవరం సర్ సీవీ రామన్ స్కూల్లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు పోస్టల్ సంక్షేమ పథకాలపై అవగాహన, కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోస్టల్ యూనియన్ లీడర్ లెనిన్ బాబు మాట్లాడుతూ తపాలా శాఖ ప్రస్తుతం నూతన సాంకేతికత వినియోగించుకుంటూ కొత్త సేవల ద్వారా ప్రజలకు సేవలందిస్తుందని, పోస్టల్ శాఖలో అందించే సేవలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. స్కూల్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ కె.పార్వతి, ఉపాధ్యాయులు ఎం.శైలజ, ఎన్.రాధా తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి



డంపింగ్ యార్డ్ ఏర్పాటు వద్దని నిరసన తెలుపుతున్న బాధితులు

భీమవరం(ప్రకాశం చౌక్): పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో పాల్గొని జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. శాఖల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణం పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ అప్పారావు, జేడీ జెడ్. వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ వద్దంటూ నిరసన

నర్సాపురం 28 వార్డులో ఇళ్ల మధ్య ఉన్న తుంగపాటి చెరువును డంపింగ్ యార్డ్ చేస్తున్నారని, దాంతో తమ ఆరోగ్యాలు దెబ్బతిన్ని రోగాల పాలవుతామని డంపింగ్ యార్డ్ ఏర్పాటు వద్దని ఆ ప్రాంతానికి చెందిన మహిళలు, ఇతరులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి నిరసన తెలిపి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

మరో రెండ్రోజులు భారీ వర్షాలు

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో రెండ్రోజుల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. ఉరుముల సమయంలో రైతులు పొలాలకు దూరంగా ఉండాలని కోరారు. పొంగుతున్న కాజ్‌వేలు, కల్వర్టులు, వాగులు దాటవద్దని, అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు.

నకిలీ మద్యంపై కన్నెర్ర

- ఎక్సైజ్ కార్యాలయాల వద్ద వైఎస్సార్‌సీపీ నిరసన కార్యక్రమాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు
- జోరు వానలోనూ కొనసాగిన ఆందోళనలు



తణుకులో ఎక్సైజ్ స్టేషన్ వద్ద మద్యం సీసాలు చూపిస్తూ నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి కారుమూరి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'ఎన్' బ్రాండ్ మద్యం, నకిలీ మద్యంపై ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించి వినతిపత్రాలు అందజేసింది. నకిలీ మద్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. మద్యాన్ని కుటీర పరిశ్రమగా మార్చేసి సొమ్ములు చేసుకుంటున్నారని, టీడీపీ నేతలు ప్రజల రక్తమాంసాలు దోచేస్తున్నారంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం జోరువానలో కూడా పలు నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి.

తణుకు నియోజకవర్గంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నేతృత్వంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం కొనసాగింది. పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ సీఐ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా చీప్ లిక్కర్ బాటిళ్లను ఎక్సైజ్ సీఐ కార్యాలయం ముందు పారబోసి ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. కారుమూరి మాట్లాడుతూ ప్రజల రక్తమాంసాలతో ప్రభుత్వం వ్యాపారం చేస్తోందని, ఇంటికో ఉద్యోగం కాకుండా ఊరూరా మద్యం కుటీర పరిశ్రమ పెట్టి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. నకిలీ మద్యాన్ని కూటమి ప్రభుత్వం పెంచి పోషిస్తోందని మండిపడ్డారు. అనంతరం ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

కైకలూరులో..

కైకలూరు నియోజకవర్గంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు నేతృత్వంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ నకిలీ మద్యం ముఠా గుట్టు రట్టు చేయాలని, సర్కారు అండదండలతోనే మద్యం కుటీర పరిశ్రమగా మారిందని ధ్వజమెత్తారు.



పాలకొల్లులో నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గుడాల గోపి తదితరులు



కైకలూరు జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

ఏలూరులో..

ఏలూరులో పార్టీ సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. సెయింట్ థెరిస్సా కాలేజీ సెంటరులో ఉన్న దివంగత వైఎస్సార్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం న్యూ అశోక్‌నగర్‌లోని ఎక్సైజ్ డీసీ కార్యాలయం వద్ద నిరసన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ నకిలీ మద్యం విక్రయాల్లో కూటమి నేతలే పాత్రధారులు, సూత్రధారులని సీబీఐ విచారణ నిర్వహించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ధ్వజమెత్తారు. ఏలూరులో వైన్‌షాపులో ఒక వ్యక్తి మద్యం సేవించి మృతి చెందింతే ఆ బ్యాచ్ మద్యం సీసాల మొత్తాన్ని మాయం చేశారని దీనిపై విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

నూజివీడులో..

నూజివీడులో సమన్వయకర్త మేకా ప్రతాప అప్పారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపి ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిరసన నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందించారు. నకిలీ మద్యంతో ప్రభుత్వ ఆదాయానికి కూటమి నేతలు గండికొడుతూ వ్యక్తిగత ఆదాయాన్ని పెంచుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

పోలవరం నియోజకవర్గంలో.. పోలవరంలో పార్టీ సమన్వయకర్త తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో నకిలీ మద్యంపై నిరసన తెలియచేస్తూ పోలవరంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ నకిలీ మద్యం అంతమయ్యేవరకు పోరాటం కొనసాగుతుందని పిలుపునిచ్చారు. కూటమి నేతలే నకిలీ మద్యం సిండికేట్ నడుపుతున్నారని తెలిసినా ప్రభుత్వం మాత్రం చోద్యం చూడడం నీతిమాలిన చర్య అని ధ్వజమెత్తారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలులో ఏలూరు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ నేతృత్వంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందచేశారు. నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమగా మార్చి ఇప్పుడు బహిర్గతం కాగానే దాన్ని వైఎస్సార్‌సీపీపై మోపడానికి కూటమి నేతలు చేస్తున్న కుట్రలను ప్రజలందరూ గమనిస్తున్నారని ధ్వజమెత్తారు. కేసులో పట్టుబడిన వ్యక్తులందరూ చంద్రబాబు, లోకేష్‌కు సన్నిహితులని సీబీఐ విచారణ జరిగితేనే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు.

చింతలపూడిలో..

చింతలపూడి నియోజకవర్గంలో మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు ఆధ్వర్యంలో చింతలపూడి ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గురునాథరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో నకిలీ మద్యం రాకెట్‌కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టి ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి కోట్లు దండుకుంటుందని ధ్వజమెత్తారు.

పాలకొల్లు నియోజకవర్గంలో..

పాలకొల్లు నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి నేతృత్వంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందించారు. నకిలీ మద్యంలో టీడీపీ పెద్దల పేర్లు బయటకు రాకుండా కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు తెరతీసి వైఎస్సార్‌సీపీపై బురదజల్లుతుందంటూ మండిపడ్డారు.



ఏలూరులో ఆందోళన చేస్తున్న ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్ తదితరులు



నూజివీడులోని ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



భీమడోలులో ర్యాలీ చేస్తున్న పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్



చింతలపూడి ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

ఐటీఐ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఉండి: జిల్లాలోని ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం, ఆచంటలోని ప్రభుత్వ ఐటీఐలో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ డీఏ వేణుగోపాల్ పత్రికా ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ నెల 16 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకుని రసీదు పొందాలని సూచించారు. వివరాలకు 08816 297093, 96664 07468 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

కోటి సంతకాల సేకరణపై సమీక్ష

తణుకు అర్బన్: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రజలకు చేరువచేయాలని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సూచించారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడారు. పేదవర్గాల పిల్లలకు వైద్యవిద్యను అందించాలని, పేదలకు నాణ్యమైన వైద్యం చేరువ చేయాలన్న కలలతో 17 వైద్య కళాశాలలు సంకల్పించి విజయవంతమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేసి కుట్రలు చేస్తుందని విమర్శించారు. రచ్చబండ, సంతకాల సేకరణ, ర్యాలీలు వంటి కార్యక్రమాలపై పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

జిల్లాను ముంచెత్తిన వాన

- తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం
- జలమయమైన రోడ్లు, లోతట్టు ప్రాంతాలు
- రాకపోకలకు ఇక్కట్లు



పాలకొల్లు బస్టాండులో ప్రయాణికుల అవస్థలు



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్



నీటమునిగిన ఉండిలోని కోండ్రోతుపేట రోడ్డు



భీమవరంలో ప్రజల అవస్థలు

సాక్షి, భీమవరం: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు పడుతున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. రోడ్లు, పల్లపు ప్రాంతాలు జలమయమై రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. నకిలీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ నిర్వహించతలపెట్టిన రణభేరీ పలు నియోజకవర్గాల్లో వాయిదా పడింది.

తెల్లవారుజాము సమయంలో ఉరుములు, మెరుపులతో మొదలైన వర్షం మధ్యాహ్నం వరకు తెరిపివ్వకుండా కురుస్తూనే ఉంది. సోమవారం కావడంతో ఉదయాన్నే విద్యాసంస్థలు, ఆఫీసులకు వెళ్లే వారు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జనం లేక మార్కెట్లు వెలవెలబోయాయి. ఎక్కడికక్కడ రోడ్లపై గోతులు వర్షపు నీటితో నిండిపోయి కనిపించక పలుచోట్ల ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల పాలైన ఘటనలు చోటుచేసుకున్నాయి. భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు బస్టాండుల్లో వర్షపునీరు నిలిచిపోయి ప్రయాణికులు అవస్థలు పడ్డారు. భీమవరంలోని రజకుల కాలనీ, ఇందిరమ్మ నగర్, హౌసింగ్‌బోర్డు, మెంటేవారితోట, గునుపూడి, ఫైర్‌స్టేషన్, బ్యాంక్ కాలనీలోని పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో డ్రెయిన్లలోని చెత్త రోడ్లపైకి చేరడంతో దారిన వెళ్లే వారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్ చదలవాడ నాగరాణి పర్యటించారు. ముంపు సమస్యలపై స్థానికులతో మాట్లాడారు. భవిష్యత్తులో ముంపు సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని కమిషనర్ కె.రామచంద్రారెడ్డికి సూచించారు. ముంపునీరు లాగేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని, వ్యాధులు ప్రబలకుండా ముంపు ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించాలని ఆదేశించారు.

పాలకొల్లు హౌసింగ్‌బోర్డు కాలనీ, బస్టాండ్ సెంటర్, సలాదివారి తోట, బంగారువారి చెరువుగట్టు, బ్రాడీపేట, బెత్లహం పేట, వీవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు, మురుగునీరు ఏకమై రోడ్ల మీదకు చేరడంతో ప్రజలు, వాహనదారులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బస్టాండ్‌లో మోకాలిలోతు నీటిలో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. పెనుగొండ, ఆచంట, పెనుమంట్ర, పోడూరు మండలాల్లో శివారు ప్రాంత కాలనీల్లో వర్షంతో ఇబ్బందులు పడ్డారు. డ్రెయినేజీ వ్యవస్థలు లేకపోవడంతో రోడ్లపైనే వర్షపు నీరు నిలిచిపోయింది. మురుగుతో కలిసి నీరు రోడ్డుపై ప్రవహించడంతో దుర్వాసనతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. తణుకులో రైల్వే స్టేషన్ రోడ్డు, మున్సిపల్ ఆఫీస్ రహదారులు నీట మునిగాయి. ఆకివీడులో భారీ వర్షానికి రోడ్లు, డ్రెయిన్లు నీట మునిగాయి. జాతీయ రహదారి ముంపునకు గురైంది. సంతపేట, శాలిపేట, జవహర్ నగర్, రైల్వే స్టేషన్ రోడ్డుతోపాటు పలు గ్రామాల్లోని రహదారులు నీట మునిగాయి.

ఉండి మండలంలో..

ఉండి: ఉండి మండల రెవెన్యూ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, గ్రామ సచివాలయం, పోలీస్ స్టేషన్, డ్వాక్రా కార్యాలయాలకు వెళ్ళే రహదారి పూర్తిగా మునిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కోండ్రోతుపేట, శివాలయం, ఎంపీపీ స్కూల్‌కు వెళ్ళే రహదారి కాలువలా మారిపోయింది. గోరింతోటలో ప్రాథమిక పాఠశాలలోకి వర్షపునీరు చేరడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు వర్షపు నీటిలోనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రణభేరీ నేటికి వాయిదా

టీడీపీ నాయకుల నకిలీ మద్యం వ్యాపారం, కూటమి ప్రభుత్వ మద్యం విధానాలను నిరసిస్తూ సోమవారం వైఎస్సార్‌సీపీ నిర్వహించతలపెట్టిన రణభేరి వర్షం కారణంగా పలు నియోజకవర్గాల్లో తాత్కాలికంగా వాయిదా పడింది. తణుకు, పాలకొల్లు నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కాగా ఉదయం నుంచి వర్షం తెరిపివ్వకపోవడంతో భీమవరం, ఉండి, ఆచంట, నరసాపురం, తాడేపల్లిగూడెంలలో వాయిదా వేశారు. ఆయా నియోజకవర్గాల్లో మంగళవారం రణభేరి కార్యక్రమం యదావిధిగా జరుగనున్నట్టు పార్టీ జిల్లా కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నీట మునిగిన ప్రాంతాల పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో నీటమునిగిన ప్రాంతాలకు కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు. రజకుల కాలనీ, హౌసింగ్ బోర్డ్, ఇందిరమ్మ నగర్, మెంటేవారి తోట, పిపి రోడ్డు ప్రాంతాల్లో పరిశీలించి మున్సిపల్ అధికారులకు అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. డ్రెయిన్లలో చెత్తాచెదారం, అడ్డంకులను తొలగించడంతోపాటు రోడ్డుకు ఇరువైపులా మెరక ప్రాంతాలను చదును చేయాలని ఆదేశించారు. పీపీ రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంకు, గోడౌన్ మధ్య ఇరువైపులా నీరు నిలవడంతో అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రోడ్లు వేస్తే సరిపోదని, నీళ్లు నిలిచిపోతే రోడ్లు ఉంటాయా అని ప్రశ్నించారు.

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియన వ్యక్తి మృతదేహం

భీమవరం: భీమవరం రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై ఎం.సుబ్రహ్మణం సోమవారం విలేకరులకు తెలిపారు. మృతుడు తెలుపు రంగు చొక్కా, పర్పుల్ కలర్ లుంగీ ధరించాడని పేర్కొన్నారు. ఆకివీడు రైల్వే స్టేషన్ మాస్టారు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదుచేశామని మృతుని ఆచూకీ తెలిసినవారు 94905 17982 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

కాలువలో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం


బాలుడు నందు మృతదేహం

తణుకు అర్బన్: తణుకు పైడిపర్రు కాలువలో గల్లంతైన బాలుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. తణుకు పట్టణానికి చెందిన 8వ తరగతి విద్యార్థి బొమ్మ బోయిన జోగేంద్ర నందు (13) స్నేహితులతో కలిసి ఆడుకునేందుకు వచ్చి కాలువలో పడి గల్లంతు అయిన విషయం తెలిసిందే. సోమవారం అత్తిలి మండలం గుమ్మంపాడు లాకుల వద్ద మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. తణుకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య మందలించడంతో భర్త ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్: మద్యం సేవిస్తున్న భర్తను భార్య మందలించడంతో అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని రూరల్ హెచ్‌సీ జిలానీ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మోదుగగుంట గ్రామానికి చెందిన దండ్రు వెంకట్రావు (50) రోజూ మద్యం సేవించి ఇంటికి రావడంతో ఆదివారం భార్య వెంకటనర్సమ్మ నిలదీసింది. దీంతో వెంకట్రావు మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. అతనిని తాడేపల్లిగూడెంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని బంధువు దండ్రు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ జిలానీ తెలిపారు.

పారిజాతగిరి హుండీ ఆదాయం లెక్కింపు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఏలూరు దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బాబు నాయుడు పర్యవేక్షణలో నిర్వహించిన లెక్కింపులో 90 రోజులకు గానూ రూ. 12,88,615 ఆదాయం వచ్చినట్లు ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అబ్బిన దత్తాత్రేయ, గొట్టుముక్కల భాస్కరరాజు, వాసవీ సాయి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జోరు వాన.. నరకయాతన

పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో సోమవారం వర్షం దంచికొట్టింది. తెల్లవారు జాము నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో కూలీలు, విద్యార్థులు, ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఎనిమిది గంటలైనా వాన తగ్గకపోవడంతో ఇక చేసేది రెయిన్‌కోట్లు, గొడుగుల సాయంతో తమ తమ విధులకు వెళ్లారు. అయితే భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా రోడ్లు అధ్వానంగా ఉండడంతో గుంతలు తెలియక వాహనచోదకులు అవస్థలు పడ్డారు. పట్టణ ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపై మోకాలు లోతు నీరు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్


ఏలూరు: జలమయమైన పవరుపేట స్టేషన్ సెంటర్


బుట్టాయగూడెం: రెడ్డిగణపవరం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న జల్లేరువాగు


ఉండి: గోరింతటలో నీటమునిగిన ప్రాథమిక పాఠశాల


ఏలూరు: వర్షపునీటిలో మునిగిపోయిన ఏలూరు జీజీహెచ్ ప్రధాన ద్వారం


పాలకొల్లు సెంట్రల్: చెరువును తలపిస్తున్న పాలకొల్లు బస్టాండ్


బుట్టాయగూడెం: దేవుడు మాన్యంలో పిడుగుపాటుతో మృతి చెందిన ఆవులు

శివశివా.. ఇదేం దారుణం?

- క్షేత్రపాలకుని ఆలయంలో యాగశాల షెడ్డు తొలగింపు
- వర్షం కురవడంతో ఆలయ మండపంలో రుద్ర హోమం నిర్వహణ


క్షేత్రపాలకుని ఆలయంలో గమేళాలో హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం జరిగిన రుద్ర హోమాన్ని వీక్షించిన భక్తులు శివశివా.. ఇదేం దారుణమంటూ ముక్కున వేలేసుకున్నారు. శాస్త్రోక్తంగా హోమకుండంలో జరగాల్సిన ఈ హోమాన్ని తాపీ పనులకు వినియోగించే గమేళాలో నిర్వహించడం పట్ల పలువురు భక్తులు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే శివదేవుని ఆలయంలో ధ్వజస్తంభం ఎదురుగా, ప్రహరీ గోడకు ఆనుకుని ఉన్న యాగశాల షెడ్డులో ప్రతి సోమవారం రుద్ర హోమాన్ని జరుపుతారు. అందులో రూ.516 లు రుసుము చెల్లించి దంపతులు పాల్గొంటారు. ఇదిలా ఉంటే వేరే ప్రాంతంలో యాగశాలను నిర్మించే ఉద్దేశంతో, దేవస్థానం అధికారులు మూడు రోజుల క్రితం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ప్రస్తుత యాగశాల షెడ్డును అకస్మాత్తుగా తొలగించారు. అయితే అందులో హోమకుండం భాగానే ఉండడంతో అర్చకులు సోమవారం ఉదయం ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి, హోమ నిర్వహణకు అంతా సిద్ధం చేశారు. ఇంతలో వర్షం కురవడంతో అర్చకులకు ఏం చేయాలో? పాలుపోలేదు. అప్పటికే నలుగురు భక్తులు హోమంలో పాల్గొనేందుకు ఆన్‌లైన్ టికెట్లను కొనుగోలు చేశారు. అలాగే భక్తులు ఉన్నా.. లేకపోయినా ఈ హోమాన్ని జరపడం పరిపాటి. దాంతో అర్చకులు తప్పనిసరి పరిస్థితుల్లో, వేరే గత్యంతరం లేక ఆలయ మండపంలో, తాపీ పనులకు వినియోగించే గమేళాలో ఈ రుద్ర హోమాన్ని నిర్వహించారు. ఇది చూసిన భక్తులు విస్తుపోయారు. శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, పురాణ ప్రాశస్త్యం ఉన్న ఈ ఆలయంలో ఇలాంటి పరిస్థితులను చూసిన భక్తులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. అయితే ఈ ఘటనపై సెక్షన్ సూపరింటిండెంట్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ షెడ్డు తొలగించిన వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నది వాస్తమేనని అంగీకరించారు. అయితే ఇంజనీరింగ్ సెక్షన్ వాళ్లు పనిలోపడి మర్చిపోయారని, వర్షం కారణంగా ఉదయం టెంటు నిర్మించడం కుదరలేదన్నారు. అర్చకులు ప్రత్యామ్నాయంగా ఆలయంలో రుద్ర హోమాన్ని జరిపారన్నారు.

యువకుడిపై యువతి ఫిర్యాదు

ఉండి: ప్రేమ పేరుతో వంచించిన యువకుడిపై యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల ప్రకారం ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన 27 ఏళ్ల యువతిని చిలుకూరు గ్రామానికి చెందిన బొబ్బిలి కల్యాణ్ అనే యువకుడు ప్రేమపేరుతో వెంట తిరిగేవాడు. ఈ నెల 6 రాత్రి యువతి వద్దకు వెళ్లిన యువకుడు వారి వివాహ విషయంతో తన తల్లి,అన్నయ్య ఇద్దరూ ఒప్పుకోవడం లేదంటూ ఆమెకు సర్ది చెప్పే ప్రయత్నం చేయడంతో యువతి కేకలు వేసింది. ఆ సమయంలో నిద్రలేచిన ఆమె తండ్రి,అన్నయ్య యువకుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో యువకుడి ఇంటికి వెళ్లిన యువతి కుటుంబ సభ్యులు జరిగిన విషయం చెప్పి పెళ్లి చేయమని కోరగా వారు నిరాకరించారు. దీంతో యువతి కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు ఏఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

చింతలపూడి/లింగపాలెం: ఇటీవల లింగపాలెం మండలంలో చైన్ స్నాచింగ్ , దొంగతనాలకు పాల్పడిన ఐదుగురు నిందితులను పట్టుకుని, సొమ్మును రికవరీ చేసినట్లు డీఎస్పీ రవిచంద్ర తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కేసు వివరాలను వెల్లడించారు. ఏలూరు పట్టణానికి చెందిన చవల భార్గవ కృష్ణ, భరగడ హర్ష వర్ధన్, కాకర్లపర్తి గణేష్, బద్ది హేమ అచ్యుత్, కోలా అప్పల రాజు గత నెల 23న ధర్మాజీగూడెంలో ఒడ్డు కట్టు చెరువు రోడ్డు బాపిరాజు గూడెంలో బొల్లా నాగలక్ష్మి నుంచి బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కుని ద్విచక్ర వాహనాలపై పారిపోయారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఐ టి.క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ధర్మాజీగూడెం ఎస్సై వెంకన్నబాబు సిబ్బందితో కలిసి సోమవారం ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరి నుంచి పలు నేరాల్లో సుమారు 80 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చెడు అలవాట్లకు, సులభంగా డబ్బు సంపాదించాలి అనే ఆశతో చదువుకునే యువత దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని డీఎస్పి అభినందించారు.


చింతలపూడి సీఐ కార్యాలయంలో నిందితులతో పోలీసు అధికారులు

బాణసంచా నిల్వ చేస్తే కఠిన చర్యలు

అనధికారికంగా బాణసంచా నిల్వ చేసిన, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రవిచంద్ర హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో మండలంలోని పలు ప్రాంతాల్లో అనధికారకంగా బాణసంచా నిల్వ ఉంచిన ప్రాంతాల్లో దాడులు నిర్వహించామని తెలిపారు. దాడుల్లో ప్రగడవరం గ్రామంలో మూడు చోట్ల ఐదు లక్షల విలువైన అక్రమ మందు బాణసంచా గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు.

చోరీకి యత్నించి.. దాడిలో గాయపడి..!

ఏలూరు టౌన్: ఏలూరు ఎస్‌ఆర్ పేట, కట్టా సుబ్బారావు వీధి ప్రాంతంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి వారిపై దాడి చేసేందుకు ప్రయత్నించగా ఇంటి యజమాని అతడిని క్రికెట్ బ్యాట్‌తో కొట్టటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆ గుర్తు తెలియని వ్యక్తిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. అతను చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఏలూరు టూటౌన్ ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం కట్టా సుబ్బారావు తోట ప్రాంతంలో వీరమాచినేని మృత్యుంజయబాబు తన కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఈ నెల 8న రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృత్యుంజయబాబు ఇంట్లోకి ప్రవేశించాడు. అతను చోరీ చేసేందుకు వచ్చాడా? మరే కారణామో తెలియదు గానీ... ఇంట్లోని వారిపై క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసేందుకు ప్రయత్నించగా, అతడి చేతిలోని బ్యాట్‌ను లాక్కున్న మృత్యుంజయబాబు అతడిపై దాంతో దాడి చేశాడు. ఈ దాడిలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. మెరుగైన చికిత్సకు వైద్యులు విజయవాడ రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 12న మృతిచెందాడు. ఈ సంఘటనపై వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ సీఐ కే.అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


విజయవాడలో జీజీహెచ్‌లో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఎట్టకేలకు డ్రెయిన్ శుభ్రం

సాక్షి ఎఫెక్ట్


పరిమెళ్ల శివాలయం వద్ద ప్రధాన డ్రెయిన్‌ను శుభ్రం చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి నాగదేవి

పెంటపాడు: మండలంలోని పరిమెళ్ల పంచాయతీలో మురుగునీటి పారుదలకు అధికారులు ఎట్టకేలకు సోమవారం చర్యలు తీసుకున్నారు. ఈనెల 12 న సాక్షి దినపత్రికలో చెత్త తొలగదు.. మురుగుపారదు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి డి.నాగదేవిలు గ్రామంలో చెత్త, దుర్వాసనతో పేరుకుపోయిన పలు డ్రెయినేజీలు శుభ్రం చేయించారు. పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాలలో ముగ్గు చల్లించారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు

ఉండి: అదనపు కట్నం కోసం భర్త,అత్తమామల వేధిస్తుండడంతో ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల ప్రకారం మండలంఓలని చెరుకువాడ గ్రామానికి చెందిన కొల్లిపర విజయలక్ష్మీకి హైదరాబాద్‌లో నివాసముంటున్న మామని ప్రసాద్‌తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. అయితే గత కొంత కాలం నుంచి భర్త,అత్తమామలు ఆమెను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తూ అదనపు కట్నం తేవాలంటూ ఇంటి నుంచి వెళ్లగొట్టారు. దీంతో పుట్టింటికి వచ్చిన సదరు మహిళ సోమవారం ఉండి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు ఏఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

‘గూడెం’లో 9.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు



కడియద్దలో కురిసిన వర్షానికి రోడ్డుపై చేరిన వర్షపు నీరు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో గడచిన 24 గంటల్లో 9.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్ సోమవారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 10.4 మిల్లీ మీటర్లుగా వర్షపాతం నమోదైందన్నారు.

రాష్ట్రస్థాయిలో కడకట్ల విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పెంటపాడు: తాడేపల్లిగూడెం మండలంలోని కడకట్ల కోడే వెంకట్రావు మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పీడీ నాగేంద్రబాబు, యోగా ఉపాధ్యాయిని జి. రూపలు సోమవారం వివరాలను తెలిపారు. బాస్కెట్‌బాల్ టీంకు సంబంధించి ఏలూరులో సోమవారం జరిగిన పోటీల్లో తమ స్కూలుకు చెందిన పదోతరగతి విద్యార్థి మనోహర నిఖిల్, జయరాజులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం ఈవీ కృష్ణారావు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

మెజీషియన్ లక్ష్మీప్రసన్నకు కళా పురస్కారం



తాడేపల్లిగూడెంలో కళా పురస్కారం అందుకున్న లక్ష్మీప్రసన్న దంపతులు

తణుకు అర్బన్: తణుకుకు చెందిన ప్రముఖ మెజీషియన్, డ్యాన్స్‌మాస్టర్, యాంకర్ దండ లక్ష్మీప్రసన్న దేవి కళా పురస్కారం అందుకున్నారు. తాడేపల్లిగూడెంలో బీవీఆర్ కళా కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన నిర్వహించిన కళా మహోత్సవం–2025లో ఈ పురస్కారం అందుకున్నట్లు లక్ష్మీప్రసన్న తెలిపారు. బీవీఆర్ కళా కేంద్రం అధ్యక్షుడు బుద్దాల రామారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళా రంగ ప్రముఖులు, యువ కళాకారులు పాల్గొన్నారని, ఇటీవల కాలంలో కళారంగంలో తన ప్రాతినిధ్యాన్ని ప్రస్తావించి ఈ పురస్కారం రామారావు చేతులమీదుగా అందజేశారని ఆమె తెలిపారు.

ఓబీసీ మహిళా సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లలిత



మనుభర్తి లలిత

తణుకు అర్బన్: అఖిల భారత ఓబీసీ మహిళా సంఘం ఏపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తణుకుకు చెందిన మనుభర్తి లలిత నియమితులయ్యారు. అఖిల భారత ఓబీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు లలిత తెలిపారు. తనకు దక్కిన ఈ గౌరవాన్ని బాధ్యతగా స్వీకరించి రాష్ట్రంలో బీసీ మహిళా సాధికారత కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ నెల 27న గుంటూరులో బీసీల రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

స్వదేశీ వస్తువులను వినియోగించాలి



ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): స్వదేశీ వస్తువులను ప్రజలు విరివిగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో వాణిజ్య పనుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు, ఎంఎస్‌ఎంఈ ఉత్పత్తులు, ఆర్గానిక్ ఉత్పత్తులు, ఎస్‌హెచ్‌జీ మహిళల ఉత్పత్తుల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంయుక్తంగా తిలకించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కె.పి శైలజ, జిల్లా హ్యాండ్లూమ్స్ అధికారి ఏ.అప్పారావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, మనోజ్ వుడ్ వర్క్, కె.ఇల్లిందలపర్రు, చింతపర్రు సొసైటీ చేనేత వస్త్రాలు, మంచిలి శ్రీ పద్మ పూతరేకులు, తదితరులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమగా నకిలీ మద్యం తయారీ



తణుకులో ఎక్సైజ్ సీఐ మణికంఠరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి కారుమూరి



తణుకులో నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ఎక్సైజ్ స్టేషన్‌కు ర్యాలీగా వెళ్తున్న మాజీ మంత్రి కారుమూరి

- నారా పాలనలో అన్నీ కల్తీలే
- ఊరంతా బెల్ట్ దుకాణాలే..
- కల్తీ మద్యాన్ని అరికట్టాల్సిందే..
- తణుకు ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసనలో మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : చంద్రబాబు కూటమి ప్రభుత్వం మద్యాన్ని కుటీర పరిశ్రమగా మార్చి పేదల రక్త మాంసాలను దోచుకుతింటుందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు కనుసన్నల్లో నకిలీలే నడుస్తున్నాయని, కల్తీ మద్యం వలన లివర్లు పాడైపోయి ఆస్పత్రుల పాలైపోతున్నారన్నారు. కల్తీ మద్యం విక్రయాలను అరికట్టాలంటూ తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద కారుమూరి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యం తాగడంవలన అధికశాతం లివరు పాడైపోయి వస్తున్నారని వైద్యులే చెబుతున్నారని విమర్శించారు. బెల్ట్ ఉంటే తాట తీస్తానన్న చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా బెల్ట్ దుకాణాలను ప్రోత్సహిస్తూ అధిక సంఖ్యలో మద్యం విక్రయాలు జరిగేలా పాటుపడుతున్నారని విమర్శించారు. ఒక్క తణుకు నియోజకవర్గంలోనే 156 బెల్ట్ దుకాణాల వరకు నిర్వహణ చేస్తున్నారంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని బెల్ట్ దుకాణాలు ఉన్నాయి, ఎన్ని కల్తీ మద్యం కుటీర పరిశ్రమలు ఉన్నాయో తెలియాల్సి ఉందన్నారు. మద్యం దుకాణాల ఆవరణల్లోనే రూంలు ఏర్పాటుచేసి బలవంతంగా తాగిం చేస్తున్నారని, తణుకులో ఒక మద్యం దుకాణం ఆవరణలో ఒక వ్యక్తి తాగిపడి చనిపోతే, కూటమి ప్రభుత్వం లిక్కరు స్కాం అంటూ కుట్రలు చేస్తుందని, కానీ నేటి కూటమి ప్రభుత్వం నిర్వాకమైన కల్తీ మద్యంలో చాలామంది ఎమ్మెల్యేలు భవిష్యత్తులో లోపలకు పోతారని అన్నారు. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు మట్టి, మద్యం, ఇసుక, పేకాట, బెట్టింగ్‌లలోనే దోచుకుంటున్నారని తెలుసు కానీ నేడు కొత్తగా కల్తీ మద్యం అమ్మకాలు చేయిస్తూ రాష్ట్రంలో పేదప్రజల గుండెలను పిండేస్తున్నారని మండిపడ్డారు. పేదలను లక్షాధికారులను చేస్తానని చెప్పిన చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లోను అడుగంటించిన ఘనత సాధించారని స్పష్టం చేశారు. ఇటీవల క్యాబినెట్ మీటింగ్‌లో ఫుడ్ ప్రొడక్ట్ పరిశ్రమపై చర్చిస్తుండగా గోమాంస విక్రయాల పరిశ్రమ పెట్టే ప్రసక్తి వద్దని పవన్ కల్యాణ్ అన్నారని, కానీ తణుకులో ఇష్టానుసారంగా గోవులు, పశువులు వధిస్తున్నారని డబ్బుకు అమ్ముడుపోయి గోవధ చేయిస్తున్నారని అందుకు సహకరించిన వా రు కుటుంబాలు విచ్ఛిన్నమైపోతాయని విమర్శించారు. ప్రజల రక్తమాంసాలను పిండేసి గోవులను వధిస్తే మాత్రం మట్టికొట్టుకుపోతారని అన్నారు.

పాదయాత్రగా ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి..

మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పార్టీ పిలుపుమేరకు నిర్వహించిన కల్తీ మద్యానికి వ్యతిరేకంగా ఎక్సైజ్ శాఖ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి పార్టీ కార్యాలయం నుంచి పాదయాత్రగా బయలుదేరారు. ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి చేరుకుని మద్యం సీసాలతో నిరసన తెలిపారు. మద్యం సీసాల్లోని మద్యాన్ని రోడ్డుపై పారపోశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డికి కల్తీ మద్యం అరికట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, పంచాయితీరాజ్‌వింగ్ రాష్ట్ర కార్యదర్శి వద్లూరి సీతారాం, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎండీ హబీబుద్దీన్, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, తణుకు, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు పెనుమర్తి వెంకటరామన్న, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, తేతలి మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఝాన్సీ లారెన్స్, షేక్ ఫహీమా, మనుబర్తి లలిత, పైడి సాయిసూర్య, బొల్లా దుర్గాప్రసాద్, రామిశెట్టి రాము, చింతలపూడి సూర్యనారాయణ, వై.రామకృష్ణ, కొత్తపల్లి చరణ్, బిరుదుకోట చింతన్న, కోట స్వామీజీ, సరెళ్ల వీరతాత పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మునిసిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న యూనియన్ నాయకులు

తాడేపల్లిగూడెం: దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికులు సోమవారం మునిసిపల్ కమిషనర్‌కు ఎం.ఏసుబాబుకు వినతిపత్రం అందజేశారు. సుదీర్ఘకాలంగా మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని లేకుంటే యూనియన్ పిలుపు మేరకు నవంబరు మూడోతేదీ నుంచి సమ్మెకు సిద్ధమవుతున్నట్టు నాయకులు కమిషనర్‌కు తెలిపారు. ఈ మేరకు సమ్మె నోటీసు ఇచ్చారు. 12వ పీఆర్‌సీ ప్రకటించిన 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మరణించిన, రిటైర్డు అయ్యిన కార్మికుల స్థానంలో కుటుంబసభ్యులకు అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయుసీ నాయకులు ఓవి.రాజు, తాడికొండ వాసు, కళింగ లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

నేడు ఆరుగొలనులో ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను సొసైటీ వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వీరవెంకటసత్యనారాయణ తెలిపారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, సైకియాట్రిస్ట్, డెంటల్, రేడియాలజీ, ఎక్స్‌రే, ఈసీజీ, క్యాన్సర్ పరీక్షలు చేస్తారన్నారు. ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

మునిసిపల్ కమిషనర్‌కు కార్మికుల సమ్మె నోటీసు



తణుకు మునిసిపల్ కమిషనర్ రామ్‌కుమార్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న భీమారావు, కార్మికులు

తణుకు అర్బన్: మునిసిపల్ కార్మికులు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు వచ్చేనెల 3వ తేదీ నుంచి సమ్మెకు సమాయత్తమవుతున్నట్టు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, తణుకు మునిసిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బొద్దాని నాగరాజు పేర్కొన్నారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ ఆధ్వర్యంలో సోమవారం తణుకు మునిసిపల్ కమీషనర్ టి.రామ్‌కుమార్‌కు సమ్మె నోటీసు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ ప్రకటించి 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మరణించిన, రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులను అవుట్ సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని, మునిసిపల్ కార్పొరేషన్, నగర పంచాయతీల్లో పెరుగుతున్న విస్తీర్ణానికి అనుగుణంగా కార్మికుల నిష్పత్తి పెంచాలని, డైలీ వేజ్ కార్మికులను అవుట్ సోర్సింగ్‌లోకి తీసుకోవాలని, పర్మినెంట్ కార్మికుల పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, మునిసిపల్ కార్మికుల బ్యాంకు ఖాతాలు బలవంతంగా యాక్సిస్ బ్యాంకుకు మార్చరాదని, కార్మికుల పదవీ విరమణ వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి మున్సిపల్ కాలనీలు నిర్మించాలనే డిమాండ్స్ పరిష్కారం కోరుతూ సమ్మె నోటీసు ఇచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మందుల ముత్తయ్య, కొంబత్తుల రవికుమార్, బంగారు నూకరాజు, గెద్దం వెంకటేశ్వరరావు, కారంపూడి ఆంజనేయులు, బోడపాటి నారాయణ, కె. సుజాత, గూడెల్లి వసంత, ముక్కెర రాములమ్మ, అర్జీ పార్వతి, బంగారు లక్ష్మి, మందుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం



సమావేశంలో మాట్లాడుతున్న దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్

భీమవరం అర్బన్: రాష్ట్రంలో కల్తీ మద్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ హెచ్చరించారు. భీమవరం మండలంలోని కొవ్వాడ గ్రామంలో సోమవారం దళిత ఐక్య వేదిక జిల్లా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని కూటమి ప్రభుత్వం తయారు చేయించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతుందన్నారు. కల్తీ మద్యం అరికట్టకపోతే కూటమి ప్రభుత్వంపై దళిత సంఘాలు పెద్దెత్తున ఆందోళనలు చేస్తాయని హెచ్చరించారు. అణగారిన వర్గాల ప్రజలను లక్ష్యంగా చేసుకుని కల్తీ మద్యాన్ని తయారు చేస్తున్నారని ఆరోపించారు. కల్తీ మద్యాన్ని కూటమి ప్రభుత్వం అరికట్టకపోతే దళిత సంఘాలను సమీకరించి పెద్దెత్తున ఉద్యమానికి తెరలేపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్ సోమయ్య, పట్టా రామారావు, షేక్ సలీమా, పి. స్వరూపారాణి, టి. నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సమాఖ్య అధ్యక్షుడిగా రామ్‌రాయ్



జంగా రామ్‌రాయ్

తాడేపల్లిగూడెం: తెలుగు సాహితీ సమాఖ్య అధ్యక్షునిగా జంగా శ్రీనివాసరామ్‌రాయ్ ఎంపికయ్యారు. ఆదివారం రాత్రి ధన రెసిడెన్సీలో జరిగిన సమాఖ్య సమావేశంలో రామ్‌రాయ్‌ను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఎన్నికల అధికారిగా గట్టిం మాణిక్యాలరా వు వ్యవహరించారు. సమాఖ్య పూర్వ అధ్యక్షుడు ఈతకోట తాతాజీ, మండా బ్రహ్మాజీ, పైలు శ్రీనివాసరావు, గరికపాటి బాపయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు. రామ్‌రాయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

నరసాపురం: కార్తీకమాసంను పురస్కరించుకుని పంచారామ క్షేత్రాలకు నరసాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు నడుతుతున్నట్టు డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. సోమవారం ఒక్క రోజే పంచారామ క్షేత్రాలను దర్శించుకునే విధంగా ఈ బస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 26, నవంబర్ 2, 9, 16 తేదీల్లో రాత్రి 7 గంటలకు బస్సు నరసాపురంలో బయలుదేరి సోమవారం అమరావతి, ద్రాక్షారామం, సామర్లకోట, భీమవరం, పాలకొల్లు ఈ క్షేత్రాలను దర్శించి, తిరిగి అదేరోజు రాత్రికి డిపోకు చేరుతుందని తెలిపారు. పల్లె వెలుగు బస్సుకు రూ.750, అల్ట్రా పల్లె వెలుగుకు రూ.800, ఎక్స్‌ప్రెస్‌కు రూ.900లు చార్జీలు వసూలు చేస్తారని వివరించారు.

17న శ్రీధన్వంతరి జయంతోత్సవాలు



భీమవరంలో శ్రీధన్వంతరి జయంతోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

భీమవరం: నాయి బ్రాహ్మణ జేఏసి ఆధ్వర్యంలో ఈనెల 17వ తేది నుంచి భీమవరంలో శ్రీధన్వంతరి జయంతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా నాయి బ్రాహ్మణ జేఏసి ప్రెసిడెంట్ పట్నాల గణపతి, భీమవరం అధ్యక్షుడు కోడూరి రామకృష్ణ చెప్పారు. సోమవారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ధన్వంతరి జయంతోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. ప్రప్రథమ ఆయుర్వేద వైద్యుడు ధన్వంతరేనన్నారు. ఆయుర్వేద వైద్యరంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ధన్వంతరి జయంతి సందర్భంగా ఈనెల 17వ తేదీన ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఉచిత హోమియో, ఆయుర్వేదం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసి గౌరవాధ్యక్షుడు పిప్పళ్ల ప్రసాద్, మల్లువలస సత్యనారాయణ, మల్లువలస రాము, పాట్నూరి శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయీభవ కరపత్రం ఆవిష్కరణ



తణుకులో విజయీభవ కరపత్రాన్ని ఆవిష్కరించిన వర్మ, మానవత ప్రతినిధులు

తణుకు అర్బన్ : మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కెరియర్ గైడెన్స్ కమిటీ రూపొందించిన విజయీభవ కరపత్రాన్ని ప్రముఖ సంఘ సేవకులు డీవీవీఎస్ వర్మ ఆవిష్కరించారు. సోమవారం స్థానిక గమిని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వర్మ మాట్లాడుతూ విద్యార్థులు విజయీభవ కరపత్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదో తరగతి తరువాత వారు ఏ కోర్సులను ఎంపిక చేసుకోవాలి, పరీక్షలలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలపై పూర్తి అధ్యయనం చేసి రూపొందించారని స్పష్టం చేశారు. మానవత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కెరియర్ గైడెన్స్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి మాట్లాడుతూ మానవత సంస్థ ముఖ్యమైన ఆశయాల్లో నైతిక విలువల బోధన ఒకటని, ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి విద్యాసంస్థల్లో ఈ తరహా బోధన జరుగుతుందని, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 300లకుపైగా విద్యాసంస్థల్లో నైతిక విలువల బోధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు మాట్లాడుతూ నైతిక విలువల బోధన అభినందనీయమని అన్నారు. తణుకు మండలం ఉపాధ్యక్షుడు అక్కిన కాశీ విశ్వనాథం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కెరియర్ గైడెన్స్ కమిటీ డైరెక్టర్లు బోయపాటి రామలక్ష్మి, కొత్త సత్యనారాయణమూర్తి, ఆనాల ఆదినారాయణ రావు, కటారి శారదా దేవి, విశిష్ట దాత చిట్టూరి సుజాత, తణుకు మండలం శాఖ కార్యదర్శి కటారి కాశీ విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తణుకు అర్బన్: డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ సెలక్షన్స్‌లో తమ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని స్థానిక మాంటిస్సోరీ స్కూల్ డైరెక్టర్ ఎ.ప్రకాశరావు సోమవారం తెలిపారు. అండర్ 6–8 ఇన్‌లైన్ కుదప శ్రీమాధవ రింక్ 4లో బంగారు, రింక్ 5లో రజిత, అండర్ 8–10 విభాగంలో ఆళ్ల శ్రీహరి రింక్ 4లో బంగారు, రింక్ 5లో రజిత, రోడ్ 3లో రజిత, క్వాడ్ ఆళ్ల శైలజ రింక్ 1లో కాంస్య, అండర్ 10–12 విభాగంలో చిక్కాల లావణ్య రింక్ 1లో కాంస్య, రింక్ 2లో కాంస్య, చేకూరి కనిష్క వర్మ రింక్ 2లో కాంస్య, రింక్ 3లో రజిత పతకాలు సాధించారని వివరించారు. దీంతో కాకినాడలో నవంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు తణుకు విద్యార్థులు

తణుకు అర్బన్: ఏలూరు జిల్లా కొవ్వలిలో నిర్వహించిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడా ఎంపికల్లో తణుకు మాంటిస్సోరీ స్కూల్ విద్యార్థులు చేకూరి రిత్విక్ వర్మ అండర్ 14 జట్టుకు, బవిరిశెట్టి ఎస్‌వీ హర్ష వీరేంద్ర అండర్ 17 జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడల్లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు తరపున ఆడనున్నట్లు వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతోపాటు శిక్షణనిచ్చిన కోచ్ వినుకొండ ఉపేంద్రను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

మాతా శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం

యలమంచిలి: మాతా శిశు మరణాల రేటు తగ్గించటానికి కేంద్రం ప్రభుత్వం కిల్కారి కాల్ విధానం ప్రవేశ పెట్టిందని, ఈ కిల్కారి సేవలను గర్భిణులు, బాలింతలు ఉపయోగించుకోవాలని కిల్కారి రీజినల్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు అన్నారు. ఆయన సోమవారం మేడపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలను కలిసి కిల్కారి కాల్స్ ఏ విధంగా ఉపయోగపడుతున్నాయివో అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ నాలుగో నెల నుంచి పుట్టిన బిడ్డకు సంవత్సరం వరకు కిల్కారి కాల్స్ వస్తాయని, ఈ కాల్‌లో ఏ వారంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తారని తెలిపారు. కిల్కారి కాల్ వచ్చే ఫోన్‌నంబర్ 911600 103660ను గర్భిణులు, బాలింతలు తమ మొబైల్‌లో సేవ్ చేసుకోవాలని సూచించారు. మురుకుర్తి శివకుమార్, గంటా రత్నకుమారి పాల్గొన్నారు.

మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు.. ప్రయాణికుల పాట్లు

- కండిషన్‌లో లేని బస్సులతో ఉచిత ప్రయాణమా?
- ఉచిత బస్సు ప్రయాణంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



తణుకు మునిసిపల్ కార్యాలయం ముందు ఆర్టీసీ బస్సును తోస్తున్న మహిళలు



వెనుక అద్దాలు కూడా లేకుండా ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు

తణుకు అర్బన్: స్త్రీ శక్తి ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం మహిళలకే చిరాకు తెప్పిస్తుంది. ఉచిత బస్సుమాటేకానీ ప్రశాంతంగా ప్రయాణాలు చేసే పరిస్థితి లేకుండా పోయిందని, గతంలో మాదిరిగా టికెట్ చెల్లించి చేసే ప్రయాణమే నయమంటూ మహిళలు వాపోతున్నారు. కండిషన్‌లో లేని, కాలం చెల్లిన బస్సులు వివిధ రూట్లలో తిప్పుతూ ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతున్నాయంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉచిత బస్సు కారణంగా అధికసంఖ్యలో మహిళలు ఉచిత బస్సును వినియోగించుకున్నప్పటికీ సౌకర్యాలు కల్పించకపోగా, పాడైపోయిన బస్సులనే తిప్పుతూ అధికలోడును లాగలేకపోతున్నాయని వా పోతున్నారు. అవసరానికి తగ్గట్లుగా బస్సులను పెంచకుండానే ఉచిత బస్సు పథకం అమలు చేసి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల ఇబ్బందులు..

ముఖ్యంగా ఉచిత బస్సుల కారణంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే క్రమంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉచిత బస్సు పాసులతో గతంలో ఎంతో సానుకూలంగా జరిగే ప్రయాణం ఉచిత బస్సుల ప్రయాణంతో బస్సు ఎక్కాలన్నా, ఎక్కి లోపల నిల్చోవాలన్నా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఉదయం పూట విద్యాలయాలకు సమయానికి చేరుకోలేకపోతున్నామని, తిరుగు ప్రయాణంలో సైతం ఇంటికి చేరేసరికి చీకటి పడిపోతుందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాలురు, పురుషులు సైతం ఆర్టీసీ బస్సు ప్రయాణం చేయాలంటే బెంబేలెత్తిపోతున్నారు. తణుకు ఆర్టీసీ డిపో నుంచి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, బైపాస్ సర్వీసులు, సూపర్ లగ్జరీ తదితర బస్సులు గతం నుంచి 83 బస్సులు నడుస్తుండగా ఉచిత బస్సు పథకం కారణంగా రూట్లలో పెరిగిన ప్రయాణికుల తాకిడికి సరిపడా బస్సులను యాజమాన్యం మంజూరు చేయని దుస్థితి. దీంతో వివిధ రూట్లలో బస్సుల ప్రయాణంలో తీవ్రమైన జాప్యం కలుగుతోందని ప్రయాణికులు చెబుతున్నారు. అంతేకాకుండా తణుకు డిపో బస్సుల్లో కొన్ని కాలం చెల్లిన మాదిరిగా ఉన్నాయని, అతుకుల బొతుకుల మాదిరిగా టింకరింగులు చేసి వెనుక అద్దాల భాగంలో సైతం ఇనుపరేకుతో మూసి వేసి అధ్వాన్నంగా ఉన్న బస్సులు కూడా తిప్పుతున్నారని మహిళలే ఆరోపిస్తున్నారు. ప్రమాదకరంగా మారిన బస్సులు ఎక్కాలంటే భయపడుతున్నామని చెబుతున్నారు.

మహిళలే నెట్టిన వైనం

తణుకు మునిసిపల్ కార్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ముందు సోమవారం ఉదయం ఇరగవరం వైపు నుంచి వస్తున్న తణుకు ఆర్టీసీ బస్సు మొరాయించింది. దీంతో డ్రైవరు శతవిధాలా ప్రయత్నించినా లాభం లేకపోవడంతో బస్సులోని మహిళలు సైతం కిందికి దిగి బస్సును ముందుకు, వెనుకకు తోయాల్సి వచ్చింది. దీంతో బస్సులోని మహిళలు బస్సులకు మరమ్మతులు కూడా చేయించకుండా తిప్పేస్తున్నారని విమర్శలు గుప్పించారు.